# నమ్మకం

మాట నిలకడ లేనోడు, మర్యాద తక్కువోడు, ఛీ, అని తుపుక్కున ఉమ్మి, చాకిరేవు బల్లమీద నీలంగళ్ళ లుంగీ దబదబా బాదడం మొదలుపెట్టింది నూకాలు.

ఆ చెరువుగట్టున ఉన్న భూముల తగాదా తీర్చడానికి వచ్చిన నాయుడు ఓసారి నూకాలు వేపు చూసి ముఖం తిప్పుకున్నాడు. అతను దూషణ భూషణ తిరస్కారాలంతగా పట్టించుకునే మనిషి కాదు.

పెద్దోళ్ళనలా తిట్టకూడదే నూకాలు, మందలించబోయింది పక్కనే బట్టలుడకబెడుతూన్న ఆమె అత్త అంకమ్మ.

చేతిలోని లుంగీ గట్టుమీదికి విసిరి ఓ పెద్దోడు ఊరు ముఁరగడం తెలినీ పెద్దోడయిపోతున్నాడు. నాకూ నామావకూ మద్దిన దూరి నా కాడ ఆడికాడ, నాకు తెలియకుండా ఆడికాడ ఆడికి తెలియకుండ నా కాడ కుడిజేబుల ఎడం జేబుల రూపాయలు కూరుకు నాకూ ఆడికీ తగువు సెప్పి మా బతుకులు ఇడదీసినాడు గండె,

ఒల్లక. నిన్న రేతిరి మీా మావలే అంటుండు. రాజీ ఎడతాను ఇశారించాద్దని.

ఈను రాజీ ఎట్టీదేటి. రాజీయో ఎడబాపులో బగమంతుడెట్టాల. మళ్ళీ ఒడ్డున ఉన్న లుంగీ చేతిలోకి తీసుకుంద నూకాలు,

నల్లని గిరిజాలజుట్టూ బొద్దు మీాసాలూ సిల్కు-లాల్చీ గ్లాస్కో పంచలో ఠీవిగా వుండాగా, చేతులిటూ అటూ ఊపుతూ ఇరుపార్టీల మధ్య నిల్చుని పిట్టకథలు చెబుతున్నాడు నాయుడు. అసలు విషయం మరిపించి నాలుగు కథలు కథలల్లి చెప్పి ఉభయపక్షాలవారినీ, రాజీకి తేవడం ఒక ఎత్తు నాయుడికి, అలా రాజీకి రాని పక్షంలో కేసు మర్నాటికి వాయిదావేసి మరి తీరికలేదంటూ వారికి దొరక్కుండా తిప్పి, మళ్ళీ రెండు జేబులూ తడువుకొని జోక్యం పెట్టుకుంటాడు తగవులో.

నూకాలుకీ దాని మొగుడికీ మధ్య సామరస్యం అంతగా లేకపోయినా, తిట్టుకుంటూ తన్నుకుంటూ ఓ గూట్లో కాపురముండేవారు. వారి మధ్య తగువులెపుడన్నా ముదిరితే కులపెద్దలే మళ్ళీ రాజీకి తెచ్చేవారు. సాయంత్రి మయేసరికి తాగి వచ్చేవాడు నారాయుడు. వాడి నోటి కొచ్చినట్టు పేలేవాడు, తిరగబడేది నూకాలు. నారాయుడి మత్తు దిగేదాకా ఇద్దరూ తగ్గేవారు కాదు. నూకాలు వళ్ళు ముప్పుఖిపోయినా నోరు మూసేది కాదు. సగంరాత్రి గడిచాక మామూలు మనిషయ్యేవాడు నారాయుడు. ఓ మూల

పడుకుని రాగాలు తీసే భార్యని ఓదార్చేవాడు. తాగినోణ్ణి ఏదో పేల్తాను, ఒల్లకుంతె పోదలే నూకాలూ, రా మంచం మీదకిరా. రేపు నీకు పూలరయికి కొంతను సాయంత్రం వచ్చేటప్పుడు పూలట్టుకొత్తాను అని బ్రతిమిలాడేవాడు.

ఇద్దరూ ఓ మంచంమీదకు చేరేవారు.

నారాయుడికి తల్లీ తండ్రి ఉన్నారు. ఊళ్ళో మూడొంతు ఇళ్ళ బట్టలు వాళ్లే ఉతుకుతారు. నాయుడుగారింట్లో బట్టలు నారాయుడు ఉతుకుతాడు ప్రత్యేకంగా. 'నాను ఉతికి మడతెట్టి ఇస్త్రీ చేసినానంటె నెలదాకా ఎట్టిన మడత ఇడదు' అని గొప్పలు చెబితే నాయుడుకొడుకు నమ్మేవాడు.

అత్తా మావా, వాళ్ళ మధ్య అలవాటయిన పోట్లాటలో అంతగా జోక్యం పెట్టుకునేవారు కాదు. 'అరిసరిసి అల్లే ఒల్లకుంతరు.' అని నవ్వుకునేవారు. నాలుగు బట్టలు ఉతికి నాలుగు డబ్బులు కళ్ళ జూడటంతో క్రమంగా నారాయుడిలో ఉన్న అసలు మనిషి బయటికి రావడం ప్రారంభించాడు.

బీడి కాలుస్తూన్న కొడుకిని ఏట్రా నారాయుడూ, గుండె ఎండిపోద్ది, బీడీలు నేర్చినావేటి. కాల్సకు, కాన్సరు జబ్బు తొత్తాయట అని మందలించాడు మొదటి కొడుకుని అప్పన్న. కాని మానలేదు నారాయుడు. చెప్పి చెప్పి ఊరుకున్నాడు నీ ఖర్మ సావు అంటూ అప్పన్న.

తర్వాత తాగి వచ్చిన కొడుకుని, అంకమ్మ కోప్పడ బోతె ఒల్లకోయె, ఒల్లరసినప్పుడు సుక్కేసుకోవాల అని కొడుకుని వెనకేసు కొచ్చాడు గాని ఇలా తప్పతాగి భార్యని తిట్టి కొట్టి సగం రాత్రిదాకా చాకలి పేటంతా తిరుగుతా డనుకోలేదు.

కోడలు కొడుకిని కన్నప్పుడు కొండంత పొంగిపోయాడు అప్పన్న. నీ కోసం డబ్బు కూడేత్తాడురా మీ అయ్య. యసనాలు మానేత్తాడు అని మనవణ్ణి ఎత్తుకు ముద్దులాడేడు. కాని మనవడు పుట్టి మూడు నెలలు తిరక్కముందే సుక్కమ్మ వెనక తిరిగే కొడుకుని మందలించి దారికి తేలేకపోయేడు. నా మావ నన్నేలడం లేదు. నా నెందుకుంటానత్తారింట్లో, ఆ సుక్కమ్మ నొగ్గేసేదాకా ఆళ్ళ గడప తొక్కను అని పుట్టిల్లు చేరింది నూకాలు. కుల పెద్దలదగ్గర తలకొట్టుకు ఏడ్చింది. సుక్కమ్మ నొగ్గెయ్యరా బంగారంలాటి పెళ్లాన్నిడి ఏట్రా నీకీ పొయ్యేకాలం? అని పెద్దలు చీవాట్లేశారు. కులం నుంచి వెలేస్తామన్నారు. లక్ష్యపెట్టలేదు నారాయుడు. నాయుడికి చెబుతామన్నారు. నవ్వేసి. ఊరుకున్నాడు. తల్లీ తండ్రీ ఇంట్లోంచి పొమ్మన్నారు. ఊళ్ళో నడిరోడ్డుమీద చిన్న గది అద్దెకి తీసుకొని లాండ్రి పెట్టాడు. సుక్కమ్మతో కాపరం పెట్టాడు నారాయుడు.

ఏట్రా నారాయుడూ, నూకాలు నెత్తినోరూ కొట్టుకు ఏడుత్తంది, ఏలుకోరా, అడుదానుసురు దోసం కదరా, హితవు చెప్పబోయాడు అప్పన్న కొడుక్కి.

మారుమను వెల్లమను, నాకు అదంటే ఇట్టంలేదు. అన్నాడు నారాయుడు.

సూడు,సూడు, నాయుడుతో సెప్పి నిన్నేటి సేత్తానో.... బెదిరించాడు.

ఉద్యోగం తీయిత్తావేటి ఎత్తెహే .... అన్నాడు నారాయుడు.

బుడ్డోణ్ని మాకాడుంచుకుంటాం మనువెల్లు అన్నాడు కోడలితో అప్పన్న 'మన్నగుంట అన్నాయం అయిపోయింది' అని నలుగురూ అనుకునే మాటలు విని సహించలేక.

సత్తే సత్తను. కాని మల్లీమను వెల్తానా. సీ....సీ కొడుక్కయితే సెతి నేదు. జాత్తక్కు ఓడుగాని, పౌరుస మున్నోడు కడుపున పుట్టిన నాను, మల్లా మరోడికి మను వెల్తానా! నాయుడీకాడి కెల్తనన్నడు మా అయ్య. సెప్పి ఆ మారాజుకి దణ్ణం పెడతను. ఆ నాయుడే తీసుత్తడు నా కట్టవు అంది నూకాలు.

నాయుడి దగ్గర కెళ్లాలంటే ఉత్త :డిచి నాయినారింటి కెళ్ళటమా! ఏభయి రూపాయలు చేత్తో పట్టుకుంటే నాయు డింటివైపు అడుగు వెయ్యాలి. డబ్బు నేదే....ఎలాగ బుల్లి అని తండ్రనగానె చెవులనున్న అలకలు అమ్మేసింది నూకాలు మనువుకంటా ఇవెక్కువేటి! అని.

ఏబయ్యి రూపాయలూ జేబులో పెట్టుకున్న నాయుడు చిరునవ్వుతో నూకాలు గోడంతా విని చిటికవేసి ఫర్వాలేదు. వెళ్ళు. నారాయుడుగాడు నీ కాళ్ళమీద పడేలా చేస్తాను

అన్నాడు, పడిపడి దండాలుపెట్టింది నూకాలు రచ్చించండి బాబో అని,

ఎల్లిరా, రేపు రచ్చబండకాడికిదా. తగూ సెటిలయి పోద్ది అన్నాడు నాయుడు.

తిరిగివస్తూ నూకాలుతో అన్నాడు దాని తండ్రి ఈరన్న ఇశారించకు బుల్లి, కేసు నాయుడిసేతుల ఎట్టాం. అన్ని ఆయనే సూసుకుంతడు అని డబ్బివ్వగానె నాయుడు తన స్వంత మనిషయిపోయినట్లు.

నాయుడుగోరు సెబితేమాత్రం ఇంటాడా అని, సందేహం వెలిబుచ్చింది నూకాలు.

ఏహె, ఇనకేం సేత్తడు. నాయుడంటే ఏటనుకున్నవు ఇని తీరాల్సిందే నేపోతే జనాన్ని పిలుస్తడు. అదీ గాదంటె కటకటాలు సూపిత్తడు ఏటనుకున్నావు ? అన్నాడు ఈరన్న !

బెదిరించడానికి అప్పుడప్పుడు కొన్ని తగవులకి కాన్‌స్టేబుల్ని పిలిచి తీసుకువస్తాడు నాయుడు. రెండు రూపాయలు జేబులోపెడితే యజమాని వెంటకుక్కలా అతనివెంట వస్తాడు జవాను. తగువు తెగిపోతె మరో రెండు రూపాయలిస్తాడు నాయుడు జవానుకి.

నాయుడంటె మహాగొప్ప నమ్మకం ఆ ఊరి ప్రజలకి. నమ్మకమే కాదు భక్తి గౌరవాలూ ఉన్నాయి. అవి ఎంతదాకా వెళ్తాయంటె తనకంతగా చదువు సంధ్యలు లేకపోయినా రూల్సులంటె ఏమిటో తెలియకపోయినా ఆంధ్రా

సమ్మెలో ఆంధ్రరాష్ట్రం కావాలంటూ నాయుడూ నినాదాలు చేశాడు, పూలదండ వేసుకొని నడిరోడ్డుమీద కూచుని సత్యాగ్రహం చేశాడు. విద్యార్థులకి అండగా ఉన్నానన్నాడు. వారిని ఉసికొలిపాడు ప్రభుత్వాన్ని అదరగొట్టాలని. ఆ ఊర్లోనూ అరాచకం రేగింది. పెద్ద ఆఫీసర్ని కుర్రాళ్ళు రాళ్ళతో కొట్టారు. ఆ వార్త జిల్లా కలెక్టరుకి చేరింది, రాత్రికి రాత్రి హుటాహుటీగా కలెక్టరూ, సి. ఆర్. పి. ఊర్లో దిగిపోయారు.

నాయుడుగారు ఊరంతా సద్దుమణిగాక తెల్లని ఇస్త్రీ బట్టలు వేసుకొని సెంటూ అత్తరూ పూసుకొని ప్రియురాలి ఇంటివైపు వెళ్తున్నారు. కలెక్టరు జీపు ఎదురయ్యేసరికి తబ్బిబ్బయి తడబడి పరుగుతీసారు పక్కసందులోకి. ఎదురయి జీపు నిలిస్తే నమస్కారంచేస్తే వదిలేస్తారు కాని అపరాధిలా పరుగుతీస్తే పోలీసుల కనుమానం రాదూ, వెంటబడి పట్టుకున్నారు.

నాయుణ్ణి కటకటాల్లో పెట్టారు. ఊరిప్రజ అల్లల్లాడిపోతున్నారు. నాయుడితోపాటు నలుగురు కుర్రాళ్లూ పట్టుబడ్డారు. చాలామందిని కటకటాలు చూపిస్తాను, అని బెదిరించాడే కాని కటకటాలు ఎరగడు నాయుడు. అవమానం సిగ్గూ భయం నాలుగు రోజులకే నాలుగు సంవత్సరాలయి జైల్లో ఉన్నట్లు నీర్సించిపోయాడు, ఊరి ప్రజలంతా తండోపతండాలుగా అతన్ని పరామర్శించి వెళ్తున్నారు. నాయుడిగార్ని ఎలా విడిపించాలి అని ఆత్రతపడ్డారు. అతన్ని విడిపిం

చడానికి కావాల్సిన డబ్బు తమ ఊరూ పొరుగూళ్లూ ఇంటింటా చందాలు దండి పోగుచేసి మొత్తంమీద నాయుడు ఇంటికివచ్చేదాకా నిద్రపోలేదు అమాయకప్రజనం. నాయుడు గారు జైలునుంచి వస్తూంటే దెబ్బలుతిని సరిగా తిండీ నీళ్ళు లేక జైల్లో పడివున్న విద్యార్థులు దీనంగా చూశారు. వాళ్ళవైపు ముఖమెత్తి చూడటానికి భయపడ్డాడు నాయుడు.

నాయుడుగారు వచ్చారని ఊళ్ళోవాళ్ళు సంబరం చేసుకున్నారు. తమ సంతోషం వెలిబుచ్చడం ఎలా అంటే నాయుణ్ణి కొత్తబట్టలతో పూలదండలతో నిలువుబొట్టుతో పెళ్ళికొమారునిలా ముస్తాబుచేసి రిక్షాలో కూచోబెట్టి ఊరంతా మేళతాళాలతో ఊరేగించారు. ఆ సంతోషంలో సంబరంలో తనతోపాటు జైల్లో పెట్టబడిన విద్యార్థుల సంగతి మరచి ఊరేగేడు నాయుడు. పాటకజనం పండుగ చేసుకుంటే, అక్షరాస్యులు ఆ తతంగాన్ని అసహ్యించుకున్నారు.

మేళతాళాలు విన్న నూకాలు నాయుడుగా రొస్తన్నారు అని అరిచి అన్నం కుతకుత ఉడుకుతుంటే పొయిలో మండే కట్టెలు లాగేసి, వీధిలోకి పరుగు తీసింది. కళ్ళపండుగ సూడాల అంటూ అంకమ్మ అప్పన్నా వీధిలోకి వచ్చారు. నాయుడు ఇంటింట హారతులూ అందుకుంటూ చిర్నవ్వుతో వసూంటె అతని పాదాలంటి దణ్ణాలు పెట్టారు ప్రజలు.

నాయుడుగోరు ఎంకటరమణమూర్తి నాగున్నారు. అంది నూకాలు పరవశంగా.

అంత నమ్మకం నాయుడంటె అందరికి.

నూకాలు నాయుడింటికి వెళ్ళిందని తెలిసింది నారా యుడికి. రాత్రి ఎనిమిదిగంటలవేళ ఇస్త్రీ చేసిన ఖరీదైన కొత్తచీరలు నాలుగు చంకన పెట్టుకున్నాడు. గప్‌చిప్‌గా పొరుగూరు వెళ్ళి ఎనభై రూపాయలకి అమ్మేశాడు. మర్నాటి ఉదయమే నాయుడిగారింటికెళ్ళి వినయంగా నాయుడికి నమ స్కారం పెట్టాడు.

ఏఁట్రా ఇలా వచ్చావు? ఏమీ తెలియనట్టూ అతి మామూలుగా పలకరించాడు నాయుడు.

నిన్న మా నూకాలొచ్చిందట, నీళ్ళు నమిలాడు నారాయుడు.

దాన్నేలుకోవాల నువ్వు, చుక్కమ్మ నోగ్గేయ్యాల' ఆజ్ఞాపిస్తున్నట్టున్నాడు నాయుడు.

నన్ను వెయ్యి ముక్కలు సెయ్యండి నాయుడుగోరు. కాని దాన్నేలుకోనండి. సుక్కమ్మ నొగ్గెయ్యమంటె....నాను బతకనేనండి. అని నాయుడి ముందు ఎనిమిది పదిరూపాయల కాయితాలుంచి తవరిదయ అన్నాడు నారాయుడు.

ఇంట్లో ఆడంగుల దృష్టి దానిమీద పడకుండా పక్క జేబులో కూరేసి నానుసుత్తాన్నేరా రచ్చబండకాడికి రా సాయంత్రం అన్నాడు నాయుడు.

దణ్ణం బాబయ్యా, బట్టలేవన్నా ఉంటె బడమ్యెండి అన్నాడు నారాయుడు.

నాలుగుజతల బట్టలువేసి సాయంత్రానికల్లా తెమ్మన్నారు నాయుడు.

సాయంత్రం రచ్చబండ కెళ్ళేముందు నాయుడుగారింటికి బట్టలందించి నాకేసి దయచూడండి బాబయ్యా అన్నాడు నారాయుడు.

అలాగె ఎల్లిరా అన్నాడు నాయుడు.

సాయంత్రం రచ్చబండ దగ్గర జనం గుమిగూడారు. ఇరు పక్షాలకి తీర్పుచెప్పాడు నాయుడు. నారాయుడివైపు చూసి కన్ను గీటాడు తర్వాత కంట్లో ఏదో పడ్డట్టు నులుముకున్నాడు.

ఆ. ఏలుకుంతాను సిత్తం బాబయ్యా అన్నాడు నారాయుడు.

నారాయుడితో కాపురం సెయ్యనేను బాబయ్యా, ఓ వరలో రెండుకత్తులిమడవు సుక్కను వొగ్గెయ్యాల అంది నూకాలు.

దాన్నొగ్గను బాబయ్యా. అది నాకు పానాలిత్తంది అన్నాడు నారాయుడు.

చివరికి నూకాలుకి నెలకి పాతిక రూపాయలివ్వటానికి పూరి ఇల్లూ గరువూ దానిపేర వ్రాయటానికి అంగీకరింపజేశాడు నారాయుడిచేత నాయుడు.

సెబాసు మా గొప్పగ తీర్పు సెప్పిండు అన్నారక్కడి జనం తృప్తిగా. అడికంతే గావాలి అని కసిగా నూకాలు ఇంటి కెళ్ళింది.

నాయుడు గడపలో అడుగు పెడుతుంటె అతని తోవ కడ్డుపడ్డాడు నారాయుడు. ఏటిబాబు అలాటి తీరుపిచ్చిన్రు. పాతికరూపాలిచ్చుకోడమంటే తరవా. అదీగాక కొంపా గరువ్వు ఒగ్గేసుకోమంతరా. అని ఏడ్చినంత పనిచేశాడు.

నాయుడేం మంత్రం వేశాడో మరి నారాయుడు మర్నాటినుంచి మహా నిబ్బరంగా తిరిగేవాడు.

నూకాలుకి పాతికరూపాయలూ ఇవ్వలేదు, గరువూ పాకా దానిపేర రాస్తున్నాం వేలుముద్దర వెయ్యరా! అంటె నువ్వెవడివి నాకు సెప్పడానికి! అని నాయుడంతవాణ్ని ఎదిరించాడు.

తర్వాత చాలాసార్లు పదీపాతికా నాయుడికిచ్చి నారాయుడిచేత భరణం, గరువూపాకా వచ్చేలా చూడమంది నూకాలు. నారాయుడు నాయుడింటి బట్టలు ఊరికే ఉతుకుతున్నాడు. అప్పుడప్పుడు తాంబూలం ఖర్చు ఇస్తున్నాడు.

నూకాలుకీ నారాయుడికీ మధ్య ఉన్న తగువు తీరలేదు. నారాయుడు ఎదురయితే ఎదవ సచ్చినోడు, సిగ్గునే నెదవ అని తుపుక్కున ఉమ్మేతుంది నూకాలు. ఒల్లు తిమ్మిరెక్కింటేటి? ఎముకలేరెయ్యగల్ను అంటాడు నారాయుడు.

సుక్కమ్మ ఇద్దరు పిల్లల తల్లయింది. తల్లీ తండ్రీ భార్యా పూర్తిగా విస్మరించారు. ఇప్పుడు నారాయుడ్ని తిట్టడంలేదు నూకాలు. నాయుడ్ని తిడుతూంది.

నూకాలూ, అగల్లనుంగీ సదూకునీ కుర్రోడిది. సింపేసినావంటి సూడు ఇంటికి అగ్గెట్టెత్తడు. పోలీసోడుగాదు నాలుగు తిట్టి డబ్బులుచ్చుకు పోడానికి, 'ఎదవ సచ్చినోడు, నా ఉసురూ నా బుట్టెడుసురూ, ఈడికెప్పుడు తగుల్తదిరా దేవుడ' అని పంచ రాయికేసి బాదుతూన్న నూకాల్ని హెచ్చరించింది అంకమ్మ.

ఈ సూడెంటు కుఱ్ఱోళ్ళు ఇలా టోళ్ళ గిరజాల కగ్గెట్టెత్తే బాగున్ను అంది నూకాలు.

ఒల్లకోమె అని దండాలు బాబూ! అంది నాయుడు తమ దగ్గరలోకి రావడం చూసి అంకమ్మ.

హుందాగా తల పంకించి ముందుకి వెళ్ళిపోయాడు నాయుడు.

* * *

చుక్కమ్మ ఇద్దరు పిల్లల్ని వదిలి మరొకడితో లేచి పోయింది పత్తాలేకుండా. ఒకనాటి ఉదయం మూడు పదిరూపాయల కాయితాలు పట్టుకొని నాయుడింటికివచ్చాడు నారాయుడు.

ఏమిటి సంగతీ? అని కనులతోనే ప్రశ్నించాడు నాయుడు:

నూకాలుకీ నాకూ రాజీకుదర్చాల. చుక్కమ్మని నాలుగు తిట్టి అది ఏడితోటో నెగిసిపోయింది బాబూ! కుట్రోళ్ళకి మరగబెట్టి పోసే దిక్కులేదు అన్నాడు నారాయుడు.

మూడు పదుల కాయితాలూ పక్కజేబులో పెట్టుకొని దానికి కబురుచేసి చెబుతాను అన్నాడు నాయుడు.

అంకమ్మకీ అప్పన్నకీ కబురంపి రప్పించి మీ కొడుకు మీ దగ్గర కొస్తాడు అని నాయుడు చెప్పగానే సంబరపడ్డారు మొదట, మళ్ళీ కొడుకు వదిలినా తాను వదలకుండా కష్టానికీ సుఖానికీ ఆదుకొంటున్న కోడలు సమ్మతించాలన్నారు వాళ్ళు. నాయుడు ఇరకాటంలో పడ్డాడు. పెళ్ళిందేకాని పుట్టింట్లో పెన్నాళ్ళో ఉండలేదు నూకాలు. అత్తమామల దగ్గరికే వచ్చింది, కొడుకు ఐదేళ్ళవాడయ్యాడు, ఇంక మొగుడెందుకంటుంది విరక్తిగా నూకాలు. అలాటి దెలా సమ్మతిస్తుంది! అయినా తనను చూస్తూనే నిప్పులు చెరుగుతుంది. కానీ చూద్దాం అనుకున్న నాయుడు చెప్పి చూడండి అన్నాడు.

నారాయుడిగాడు మనదగ్గర కొచ్చేస్తాడంట అని అంకమ్మ చెప్పీ చెప్పడంతో కస్సుమంది నూకాలు. మీకు సిగ్గునేదు. మీ కొడుక్కీ సిగ్గునేదు. ఆ నాయుడికి సిగ్గునేదు. నాకు సిగ్గునేదా? ఆడికి తగని జబ్బట్టుకుంది. అందుకే

చుక్కమ్మ ఒగ్గేసిపోయింది. దాని పిల్లల్ని ఈడిమీద ఒగ్గేసింది. వాడొస్తే నానీ ఇంట్లో ఉండను. ఖచ్చితంగా చెప్పింది నూకాలు.

నాయుడుగోరు పోరి ఒప్పించినారట! ఇల్లాలువిగా వంటె. వాడెంతసెడ్డా మొగుడుగాడంటె. ఆ రంకుది ఒగ్గేసినట్టు నువ్వూ ఒగ్గేత్తావేటి! ఒగ్గేతె దానికీ నీకూ ఎత్తేసం ఏవుంది. అని కులపెద్దలంతా నూకాలుకి హితవులూ నీతులూ వాళ్ళకి తెలిసిన పతివ్రతా ధర్మాలూ చెప్పి వప్పించారు.

చెడి తమకు కాకుండా పోయాడనుకున్న కొడుకు మళ్ళీ ఇంట్లో తిరుగుతూంటే తలిదండ్రులకు సంతోషంగానే ఉంది. నాయుడుగోరు దేవుడు. మళ్ళీ మాకొడుకూ కోడలూ కాపురం కుదుటపరిచారు, అని చేతులు జోడిస్తున్నారు. వాళ్ళే కాదు, ఆ ఊరి అలగా జనమంతా నాయుణ్ని దేవుడి లాగె నమ్ముతారు.

ఒక్క నమ్మలేనిది నూకాలె. తన దగ్గర చేరబోయిన నారాయుణ్ని, మావా సత్తైసచ్చినావుగాని నన్నంటక, నువ్వంటె నా మనుసిరిగిపోనాది, అని ఖచ్చితంగా చెప్పింది.

నాయుడుగోరు ఏటి సెప్పిన్రు అని నారాయుడింకేమో అనబోతుంటే అతడొకెదవ. డబ్బు కక్కుర్తెదవ, ఆడికి మనవిచ్చిన డబ్బేడితె పెంకుటిల్లు కడుదువు. అంద నూకాలు.

నాయుడు దేవుడే అన్నాడు నమ్మకం సడలని నారాయుడు.